జీతాలనూ ఇవ్వలేకున్నారు..

వర్సిటీని అభివృద్ధిబాటలో నడిపించాల్సిన ప్రభుత్వం.. వేళకు వేతనాలివ్వలేని దుస్థితిని తెచ్చింది. వర్సిటీ చరిత్రలో ఎన్నడూలేని విధంగా నెలల తరబడి జాప్యం జరుగుతోంది. జీతాల నిధుల మంజూరు కోసం వర్సిటీ వర్గాలు ఎదురుచూడాల్సి వస్తోంది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కనీసం మూడునెలల ఒకసారైనా విడుదలచేయడంలేదు. నెలకు ఇవ్వాల్సిన జీతాలను మూడు నెలలకొకసారి చెల్లిస్తోంది. క్రమం తప్పకుండా ప్రతి నెలా జీతాలు జమ అయినట్లు గతంలో బ్యాంక్ నుంచి మెస్సేజ్‌లు వచ్చేవని, ఇప్పుడు మెసేజ్‌ల కోసం ఎదురుచూడాల్సి వస్తోందిన ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 26 మార్చి 2024



నాడు అంతర్జాతీయ ఖ్యాతి..

నేడు అధోగతి..!



అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన పరిపాలనా భవనం

ఎన్టీఆర్ ఆడిటోరియం

టీడీపీ హయాంలో జేఎన్‌టీయూ అభివృద్ధి

- అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పన
- రూ.100 కోట్లతో అధునాతన భవనాల నిర్మాణం
- వైసీపీ పాలనలో ఉద్యోగులకు నెల జీతాలు కరువు

నాటి ఘనతే..



టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో వ్యవహరించారు. విద్యార్థుల అభ్యున్నతికోసం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి బాటలు వేశారు. పూర్వ విద్యార్థులు, మేధావులు అప్పటి అభివృద్ధిని గుర్తు చేసుకుంటున్నారు. జేఎన్‌టీయూకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(న్యాక్) 'ఏ' గ్రేడ్ గుర్తింపు లభించడం టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమని అంటున్నారు. మౌలిక సదుపాయాల అంశంలో లెక్చరర్ హాల్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఫార్మసీ బిల్డింగ్, అకడమిక్ బ్లాక్ భవనాలకు న్యాక్‌లో మంచి మార్కులు వచ్చాయి. అడ్మినిస్ట్రేషన్, అకడమిక్ పరంగా అధునాతన గరగతి గదులు, సెమినార్ హాల్స్, ల్యాబ్‌లు, లైబ్రేరీలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్ వంటివి న్యాక్ కమిటీని ఆకర్షించాయి. క్రీడలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన వ్యాయామశాల, ఇండోర్‌స్టేడియం, బాస్కెట్‌బాల్, టెన్నిస్‌బాల్ కోర్టులు కూడా న్యాక్ మంచి మార్కులు ఇచ్చింది.

నెల నుంచి మూడు నెలలు...

నెల నెలా చెల్లించాల్సిన జీతాల సమయాన్ని వైసీపీ ప్రభుత్వం మూడు నెలలకు ఒక సారి అన్నట్లు మార్చింది. జీతాలకోసం జేఎన్‌టీయూ, ఎస్కేయూ ఉద్యోగులు ప్రతి నెలా ఎదురుచూస్తున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన జీతాల నిధులను సైతం విడుదల చేయడం లేదు. ప్రతినెలా వర్సిటీల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఉద్యోగులకు జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభావం పరోక్షంగా విద్యార్థులపై పడుతోంది.

- వేమన, ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు

అభివృద్ధికి నిదర్శనం...

టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి నిదర్శనం జేఎన్‌టీయూ. జిల్లాలోని జేఎన్‌టీయూ, ఎస్కేయూకి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి ప్రోత్రహించాం. వర్సిటీ యాజమాన్యాల ప్రతిపాదనలను మంత్రిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఆమోదముద్ర వేయించాము. రూ.కోట్లు వెచ్చించి అధునత భవనాలు, రోడ్లు, అదనపు సౌకర్యాలు కల్పించాము. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు చెల్లించేందుకు సరిపడా నిధులు విడుదల చేశాము. జగన్ సర్కార్ మాత్రం విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఐదేళ్లుగా అభివృద్ధికి, జీతాలకు నిధులివ్వకుండా వేధిస్తోంది.

- పరిటాల సునీత, మాజీ మంత్రి



జేఎన్‌టీయూ ముఖద్వారం



కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ భవనం

అనంతపురం సెంట్రల్

అత్యుత్తమ సాంకేతిక విద్య, ఆవిష్కరణలతో అనంతపురం జేఎన్‌టీయూ రాయలసీమ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటింది. టీడీపీ ప్రభుత్వ సహకారంతో అభివృద్ధికి నిర్వచనంగా విరాజిల్లింది. దాదాపు రూ.100 కోట్లతో అధునాత భవనాలను అప్పట్లో నిర్మించారు. మెట్రో నగరాలలో విద్యా సంస్థలకు దీటుగా అత్యాధునిక సదుపాయాలను కల్పించారు. జాతీయస్థాయిలో అన్నిరంగాల ప్రముఖుల నుంచి వర్సిటీ ప్రశంసలు అందుకుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, డీఆర్‌డీఏ అధికారులు, గవర్నర్లు.. ఇలా ఎంతోమంది ప్రముఖులు వర్సిటీలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. వర్సిటీ అభివృద్ధి, వసతుల కల్పనపై ప్రశంసలు కురిపించారు. విశాలమైన, అధునాతన సౌకర్యాలతో నిర్మించిన ఎన్టీఆర్ ఆడిటోరియం.. వర్సిటీ సొంతం. బెంగళూరు, చైన్నై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లోని వర్సిటీలకు దీటుగా అకడమిక్ బ్లాక్, లెక్చరర్ హాల్, ఫార్మసీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి భవనాలను నిర్మించారు. జిమ్, యోగా కేంద్రం, ఇండోర్ స్టేడియం, బాస్కెట్‌బాల్, టెన్నిబాల్ కోర్టులు వంటివి వర్సిటీకి ఆభరణాలు. జేఎన్‌టీయూ ప్రాంగణం ఒక కొత్త నగరాన్ని తలపిస్తుంది. ఇదంతా గతం. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా వర్సిటీ అభివృద్ధికి ఇవ్వలేదు. ఉద్యోగులకు జీతాలను సకాలంలో చెల్లించలేని దుస్థతి నెలకొంది. టీడీపీ హయాంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు వచ్చేవి.. జగన్ పాలనలో మూడు నెలలకు ఒకసారి తీసుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ఉద్యోగ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. ఐదేళ్లలో క్రమం తప్పకుండా ఏ ఐదు నెలలూ జీతాలు ఇచ్చిన ఆనవాళ్లు లేవని వాపోతున్నారు.

వ్యవస్థల పునర్నిర్మాణం..

అన్నిరంగాలు స్వేచ్ఛగా పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా అన్ని వ్యవస్థల పునర్నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రోత్సహించింది. ఉన్నత విద్యనందించే వర్సిటీల పరిపాలన అంశాల్లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం, వర్సిటీ పాలకమండలిని సమన్వంచేస్తూ అభివృద్ధికి అవసరమైన నిధులను రాబట్టింది. పాలక మండలి నిర్ణయాలను అమలుచేసేలా వెన్నుతట్టి ప్రోత్సహించింది. జాతీయ సంస్థలు అందించే నిధులను రాబట్టేందుకు ముందుండి పనిచేసింది. వైసీపీ ప్రభుత్వం మాత్రం వర్సిటీల నిధులను కాజేస్తూ, భవిష్యత్తును ప్రశ్నార్థంగా మార్చింది.



నైపుణ్య శిక్షణా కేంద్ర భవనం

నూతన భవనాలే ఆభరణాలు..

మౌలిక సదుపాయాలతో కూడిన భవనాలే వర్సిటీకి ఆభరణాలు. అధునాతన నిర్మాణాలైన లెక్చరర్ హాల్, ఫార్మసీ బిల్డింగ్, అకడమిక్ బ్లాక్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎన్టీఆర్ ఆడిటోరియం, జిమ్ అండ్ యోగా వంటి భవనాలు న్యాక్ గ్రేడింగ్‌లో మంచి మార్కులు వచ్చేలా చేశాయి. మెట్రో నగరాలకు దీటుగా అత్యాధిక సదుపాయాలతో నూతన భవనాలు జేఎన్‌టీయూ సొంతం.

- ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ వీసీ

ఉష్ణోగ్రతలు (సోమ)

గరిష్ఠం : 39.0

కనిష్ఠం : 24.0





ఇఫ్తార్	మంగళవారం సాయంత్రం	06:33
సెహరీ	బుధవారం ఉదయం	05:04

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 25: ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమి సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేసిన వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సోమవారం వరకూ జిల్లాలో 21 మంది వలంటీర్లు, ఐదుగురు రేషన్ డీలర్లు, నలుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, ఒక పంచాయతీ కార్యదర్శిని తొలగించినట్లు తెలిపారు. సీ విజిల్ డిజిటల్ యాప్ ద్వారా పోస్టర్లు, బ్యానర్లు తొలగించలేదని, గోడలపై పార్టీ రంగులు, పేర్లు తొలగించలేదని 174 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆ ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా 5,049 పోస్టర్లు, 2,199 బ్యానర్లు, 636 గోడలపై పార్టీ రాతలు తొలగించామన్నారు. 2,988 నాయకుల విగ్రహాలు, ఫొటోలను వస్త్రాలతో కప్పేశామన్నారు.

ప్రజాగళానికి తరలిరండి..!

టీడీపీ నాయకుల పిలుపు



రాప్తాడులో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కాకినాడ రాజశేఖర్

రాప్తాడు, మార్చి 25: టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 28న రాప్తాడులో నిర్వహించే ప్రజాగళం సభను విజయవంతం చేద్దామని మాజీ మంత్రి పరిటాల సునీత, పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కాకినాడ రాజశేఖర్‌తో కలిసి సభ ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ప్రజాగళం సభ ద్వారా రాప్తాడులో టీడీపీ సత్తా ఏమిటో చూపుదామని కార్యకర్తలనుద్దేశించి పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.నారాయణచౌదరి, రాప్తాడు, ఆత్మకూరు మండల కన్వీనర్లు కొండప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రంలో ఈనెల 28న నిర్వహించే ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. సభా వేదికను సోమవారం వారు పరిశీలించారు. అంతకుముందు బాబు పర్యటనపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జనసమీకరణ, ఏర్పాట్లు, భోజనం, తాగునీటి ఏర్పాట్ల గురించి చర్చించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. 28న మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గుర్రప్ప చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం వద్ద సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం, కేశవరెడ్డి



ఆనంద హేళ



వర్ణాభిషేకం



రంగుల సంబరం



మండే వేసవి..!
ఉడుకు దుమ్ము అణచే..
ఉగాది వానలు ఇంకా రాలే..!
పాపం జనం.. ఎండకు
మాడిపోతున్నారు..!
ఇంద్ర ధనుస్సుకు జాలి కలిగింది..
కరిగి.. రంగులు రంగులుగా
దిగివచ్చింది..! కాసిన్ని నీళ్లు కలిపి..
చిన్నా పెద్దా చల్లుకున్నారు..! హోలీ..
రంగుల కేళి..! సంబరం ఆకాశాన్ని
తాకింది..!

(జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను సోమవారం ఆనందంగా జరుపుకున్నారు. తండాలలో బంజారాలు ఘనంగా పండుగ నిర్వహించుకున్నారు. అనంతలో యువతీ యువకులు సంబరాల్లో మునిగి తేలారు)

- అనంతపురం కల్చరల్



రంగుల్లో మునిగిపో..



ఆనందంలో తేలిపో..

కర్ణాటక మద్యాన్ని దించుతున్నారు..!

పోలీసులకు పట్టుబడ్డ వైసీపీ కార్యకర్తలు



నిందితులు, పట్టుబడిన మద్యంతో పోలీసులు

రాప్తాడు, మార్చి 25: కర్ణాటకలోని ఎగుపల్లి నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువస్తున్న ముగ్గురిని రాప్తాడు పోలీసులు అరెస్టు చేశారు. వీరు ముగ్గురూ వైసీపీ కార్యకర్తలు కావడం గమనార్హం. పేరూరుకు చెందిన రాకేష్ (24), గుడుసాల మనోహర్ (24), జి. మహేష్ (20) బొలెరో వాహనంలో 13 బాక్సుల కర్ణాటక మద్యాన్ని తెస్తుండగా పట్టుకున్నామని అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి, రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు. బాక్సులలో ఉన్న 1,248 టెట్రా ప్యాకెట్లు, బొలెరో వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికలలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు అధికార పార్టీవారు కర్ణాటక మద్యాన్ని డంప్ చేస్తున్నట్లు సమాచారం. రాప్తాడు మండలం పాలచెర్లలో డంప్ చేసేందుకు వీరు ముగ్గురూ కర్ణాటక మద్యాన్ని తీసుకువస్తున్నట్లు తెలిసింది. గతంలో కూడా వీరు కర్ణాటక మద్యం తెస్తూ పట్టుబడ్డారు.

డ్రగ్స్ ఆంధ్రగా రాష్ట్రం: టీఎన్‌ఎస్‌ఎఫ్



సమావేశంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మార్చి 25: అన్నపూర్ణగా ఉన్న రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం డ్రగ్స్ ఆంధ్రగా మార్చిందని టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు మండిపడ్డారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు మెడికల్ కాలేజీ, ఒంగోలు రిమ్స్ కాలేజీలో మెడికోలు పట్టపగలే గంజాయి సేవించి దాడులు చేసుకునే పరిస్థితి రావడానికి ఈ ప్రభుత్వమే కారణమని అన్నారు.టీడీపీ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఒకటో స్థానంలో ఉన్న ఏపీని నేడు గంజాయి అక్రమ రవాణలో ఒకటో స్థానానికి తేవాలని వైసీపీ నాయకులు, ప్రభుత్వం చూస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్లు వైసీపీ రొచ్చులో పడవద్దని, విలువైన ఓటుతో తమ జీవితాలను బంగారుమయం చేసుకోవాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనరసింహ, బీసీ సాధికార సమితి డైరెక్టర్ నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ అసమ్మతి నాయకుల సమావేశం

బుక్కరాయసముద్రం, మార్చి 25: వైసీపీ శింగనమల నియోజకవర్గ అసమ్మతి నాయకులు అనంతపురంలో మంగళవారం సమావేశం కానున్నారు. వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి వ్యతిరేకంగా బళ్లా కన్వెన్షన్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు నుంచి ద్వితీయ శ్రేణి నాయులను భారీగా తరలిస్తారని సమాచారం. ఈ సమావేశం అనంతరం భవిష్యత్తు కార్యచరణ ప్రకటించే అవకాశం ఉందని అసమ్మతి నేతలు అంటున్నారు. వారిని బుజ్జగించేందుకు ఆలూరు సాంబశివారెడ్డి గతంలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, త్రిసభ్య కమిటీ నాయకులు తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, అనంతపురం అర్బన్ అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య బుజ్జగించినా వెనక్కు తగ్గలేదు. భారీ జనసమీకరణతో తమ సత్తా చాటుతామని ఇప్పటికే పార్టీకి హెచ్చరికలు పంపారు. దీంతో మంగళవారం జరిగే సమావేశం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని వైసీపీ వర్గీయులలో ఉత్కంఠ నెలకొంది.

వైసీపీ కోసం.. చట్ట విరుద్ధ ప్రచారం


లోలూరులో ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి (వృత్తంలో)

శింగనమల: మండలంలో లోలూరు, ఆకులేడు గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో లోలూరు పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వలంటీర్లు (వృత్తాల్లో..)

గుత్తిలో...

పట్టణంలో వైసీపీ చేపట్టిన ఆత్మీయ పలకలింపు కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కి పాల్గొన్న వలంటీర్లు. పట్టణంలోని కోటవీధిలోని 12, 13 వార్డులలో వైసీపీ నాయకులు సోమవారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన వలంటీర్లు దివాకర్, మహ్మద్‌నవీద్, నాసీర్‌హుసేన్ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో...

మండలంలో కొందరు వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. హొసళ్లి, వన్నళ్లి, దర్గాహోన్నూరు గ్రా మాలలో సోమవారం రాయదుర్గం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట స్థానిక వలంటీర్లు హనుమంత, అజయ్, బడిగె వన్నూరుస్వామి, వన్నూరుస్వామి, భాస్కర్, నాగరాజు, వన్నేశ్, వలంటీర్ భర్త సంతోష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే స్టోర్ డీలర్ ఎర్రిస్వామి మరికొందరు వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ మెట్టు గోవిందరెడ్డికి సంబంధించిన స్టిక్కర్లను అతికించారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు (వృత్తాల్లో..)

కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్ సస్పెన్షన్

శింగనమల: నియోజకవర్గంలోని వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్‌ను సస్పెండ్ చేసినట్లు ఆర్వో శ్రీను వెన్నెల తెలిపారు. వైసీపీ ప్రచారంలో నార్పలకు చెందిన డొక్క కృష్ణ, శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి బీఎల్‌వోగా పనిచేస్తున్నాడు. నార్పలలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నాడు. వెస్టు నరసాపురానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్ పూట్లూరులో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. చిన్న జలాలపురానికి చెందిన వలంటీర్ ఎం.వెంకటేశ్ శింగనమలలో జరిగిన వైసీపీ సన్మానంలో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన కథనాలు ఆంధ్రజ్యోతిలో రావడంతో అధికారులు వీరిని సస్పెండ్ చేశారు.

వలంటీర్ల తొలగింపు

తనకల్లు: మండలంలోని రాచినేపల్లికి చెందిన వలంటీర్లు మనోహర్‌నాయుడు, శ్రీహరినాయుడులను విధులనుంచి తొలగించినట్లు ఎంపీడీఓ పూల నరసింహులు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు అన్న కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆయనవారిని విధులనుంచి తొలగించినట్లు తెలిపారు.

యానిమేటర్ ఔట్

అనంతపురం క్లాక్‌టవర్: వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్ నాగరాజును విధుల నుంచి తొలగించారు. బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం శారద గ్రామైక్య సమాఖ్యలో యానిమేటర్ (వీఓఏ)గా పనిచేస్తున్నారు. ఈనెల 18వ తేదీన వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విచారణ చేసిన అనంతరం యానిమేటర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు నిర్ధారించుకున్న అనంతరం విధుల నుంచి తొలగించినట్లు డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

ప్రచారంలో పాల్గొనేదే: ఎండీయూ ఆపరేటర్లు


వైసీపీ నాయకుల సన్మానంలో పాల్గొన్న ఎండీయూ ఆపరేటర్లు అంజీల్‌రెడ్డి, లోకనాథ్ (వృత్తంలో ఉన్న వ్యక్తులు)

శింగనమల, మార్చి 25: మా ఉద్యోగాలు పోయినా వైసీపీ ప్రచారంలో పాల్గొంటామని ఎండీయూ ఆపరేటర్లు అంటున్నారు. వైసీపీ మండల కన్వీనర్‌గా నూతనంగా నియమితుడైన చిక్కాల బాలకృష్ణ సన్మాన కార్యాక్రమంలో జూలాకాలువ, చక్రాయపేట ఎండీయూ ఆపరేటర్లు అంజిల్‌రెడ్డి, లోకనాథ్ పాల్గొన్నట్లు ఆలస్యంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఘటనపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఎండీయూ ఆపరేటరే వైసీపీ మండల కన్వీనర్


వైసీపీ మండల కన్వీనర్ (వృత్తంలో..)

శింగనమల: ఎన్నికల మందు ఓటర్ల కోసం సొదనపల్లి గ్రామానికి చెందిన చిక్కాల బాలకృష్ణను వైసీపీ మండల కన్వీనర్‌గా నియమించారు. ఆయన రాచేపల్లి ఎండీయూ ఆపరేటర్‌గా ఉండి వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నాడు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. బాలకృష్ణ ఆపరేటర్ పదవికి రాజీనాయా చేయకుండా ఎన్నికల కోడ్ అతిక్రమించి ప్రచారంలో పాల్గొంటున్నాడు. ఇప్పటికైనా ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు నెలలు సెలవివ్వండి.. ప్రచారంలో పాల్గొంటాం

- ఎండీయూ ఆపరేటర్లు, డీలర్ల వినతి.. ఖంగుతిన్న అధికారులు


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శింగనమల: సార్ తాము వైసీపీ తరుపున ప్రచారం చేస్తాం... మాకు రెండు నెలలు సెలవులు ఇవ్వండి అంటూ ఎన్నికల సమావేశంలో కొందరు ఎండీయూ ఆపరేటర్లు, స్టోరు డీలర్లు అధికారులకు విన్నవించడంతో, అధికారులు ఖంగుతిన్నారు. సోమవారం ఎన్నికల నిబంధనలపై తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.. తహసీల్దార్ శోభన్‌బాబు, సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే తొలగిస్తామని హెచ్చరించారు. అంతలోనే కొందరు ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు స్పందిస్తూ వైసీపీ మాకు భిక్ష పెట్టింది, ఆపార్టీ కోసం రెండు నెలలు సెలవు ఇవ్వాలని, ప్రచారంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ మొదట రాజీనామాలు చేసి ప్రచారంలో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రాజశేఖర్, ఎన్నికల సిబ్బంది ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి.. వైసీపీ పాతర..!



- ఐదేళ్లలో డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాపై నిర్లక్ష్యం
- వేలాది మంది రైతులకు మొండిచేయి
- టీడీపీ హయాంలో 90 శాతం సబ్సిడీతో సరఫరా

అనంతపురం అర్బన్, మార్చి 25: తవైసీపీ పాలకులు కరువు జిల్లాలో సూక్ష్మసేద్యానికి పాతరేశారు. గత ఐదేళ్ల పాలనలో రెండేళ్లు డ్రిప్, స్ప్రింకర్ల సరఫరాను పూర్తిగా బంద్ చేశారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో సబ్సిడీని కుదించి అరకొరగా పరికరాలు సరఫరా చేయడంతో ప్రభుత్వం సరిపెట్టింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు కాకముందే ఈ ఏడాది జనవరి నుంచే సూక్ష్మసేద్య పరికరాల సరఫరాను ఆపేసింది. దీంతో అరటి, ఇతర రకాల ఉద్యాన పంటలు సాగు చేసేందుకు సిద్ధమైన రైతులకు నిరాశే మిగిలింది. టీడీపీ హయాంలో 2014-15 నుంచి 2018-19 దాకా ఉమ్మడి జిల్లాలోని 1,07,751 మంది రైతులకు 1,22,864.24 హెక్టార్లల్లో సూక్ష్మసేద్యం పరికరాలు సరఫరా చేశారు. వైసీపీ పాలనలో కేవలం 54,951 మంది రైతులకు 67,659.48 హెక్టార్లల్లో పరికరాలు సరఫరా చేయడంతో సరిపెట్టారు.

వైసీపీ పాలనలో సరఫరా ఇలా...

సంవత్సరం	రైతుల సంఖ్య	డ్రిప్, స్ప్రింకర్ల సరఫరా (హెక్టార్లల్లో)
2019-20	19,276	24,770.72
2020-21	-	-
2021-22	-	-
2022-23	19,045	22,883.45
2023-24	16,630	20,005.31
మొత్తం	54,951	67,659.48

ఐదేళ్లల్లో పూర్తి నిర్లక్ష్యం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి అనంత జిల్లా రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల సరఫరాలో నిర్లక్ష్యం వహించారు. 2019-20 సంవత్సరంలో కేవలం 19,276 మంది రైతులకు 24,770.72 హెక్టార్లల్లో పరికరాలు సరఫరా చేయడంతో సరిపెట్టారు. ఆ తర్వాత 2020-21, 2021-22 రెండు సంవత్సరాల్లో పరికరాల సరఫరాను పూర్తిగా బంద్ చేశారు. ఈ పరిస్థితుల్లో వేలాది మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు డ్రిప్, స్ప్రింకర్లను కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. తిరిగి 2023-24 సంవత్సరంలో పరికరాలు సరఫరాను తిరిగి మొదలు పెట్టినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. వైసీపీ పాలనలో వేలాది మంది రైతులకు మొండిచేయి చూపారు.

సబ్సిడీ కుదింపుతో తీరని అన్యాయం

టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచితంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేసేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్ లైన్స్‌ను మార్చింది. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచిత సబ్సిడీ ఎత్తేశారు. ఇతర కేటగిరిల రైతుల తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. బిందు సేద్యం ద్వారా పంటలు సాగు చేయడంపై మక్కువ పెంచుకున్న రైతులు డ్రిప్ కోసం ప్రభుత్వం విధించిన లక్ష్యం కంటే ఎక్కువ సంఖ్యలోనే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో రైతులకు పరికరాలు సరఫరా చేయకుండా చేతులేత్తేశారు.

టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	డ్రిప్, స్ప్రింకర్ల సరఫరా (హెక్టార్లల్లో)
2014-15	7,726	8,355.42
2015-16	21,157	21,687.01
2016-17	22,181	24,637.40
2017-18	29,720	34,814.49
2018-19	26,967	33,369.92
మొత్తం	1,07,751	1,22,864.24

ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేదు



మూడెకరాల్లో అరటి పంట సాగు చేసేందుకు డ్రిప్ పరికరాల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నా. ఆర్బీకేలో దరఖాస్తు చేసుకున్నా నాతో డీడీ కట్టించుకోలేదు. డ్రిప్ పరికరాలు సరిగా సరఫరా కావడం లేదని, రాగానే డీడీ కట్టించుకుంటామని అధికారులు చెప్పారు. ఎన్ని సార్లు అధికారుల వద్దకు వెళ్లి అడిగినా ప్రయోజనం లేకుండాపోయింది. బయట మార్కెట్‌లో డ్రిప్ పరికరాలు కొనలేక అరటి పంట సాగు చేయలేక పోయా.

\- నారప్ప, రైతు, నార్పల మండలం

రెండేళ్లు ఎదురుచూసినా..



రెండేళ్ల క్రితం డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేశా. రెండేళ్లుగా ఎదురుచూసినా ఇప్పటి దాకా పరికరాలు సరఫరా చేయలేదు. అధికారులను అనేక సార్లు అడిగినా అదిగో.. ఇదిగో అంటూ చెప్పుకొచ్చారు. టీడీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు స్పందించి డీడీ కట్టించుకొని, సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేసేవారు. వైసీపీ పాలనలో రైతులకు డ్రిప్ పరికరాలు సరఫరా చేయకపోవడం బాధాకరం.

\- సాదిక్ వలి, రైతు, శింగనమల మండలం

కుటాలపల్లిలో కలకలం

- హత్యతో ఉలికిపాటు
- ఘటనపై పలు అనుమానాలు

నల్లమాడ, మార్చి 25: మండలంలోని కుటాలపల్లిలో టీడీపీ నాయకుడు డి.అమరనాథ్ రెడ్డి(42) హత్య కలకలం రేపింది. హత్యతో ఊరిజనం ఉలికిపడ్డారు. హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమరనాథ్‌రెడ్డి వ్యవసాయం చేస్తుండేవాడు. సొంత పొలంతోపాటు కొంత కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేసేవాడు. పొలం వద్ద పాడి పశువులను పెంచుతున్నారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి పాల క్యాన్లు తీసుకుని పొలం వద్దకెళ్లాడు. పాలు తీసుకుని సోమవారం ఉదయం ఇంటికి రావలసిన అతడు రాలేదు. భార్య సుధమ్మ ఫోన్ చేసినా స్పందనలేదు. అనుమానం వచ్చి, పొలం వద్దకెళ్లగా అమరనాథ్ రెడ్డి రక్తపు మడుగులో పడివున్నాడు. భర్త శవాన్ని చూసి సుధమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అమరనాథ్‌రెడ్డికి కుమారుడు, కూతురు ఉన్నారు.


అమరనాథ్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి


అమరనాథ్‌రెడ్డి (ఫైల్)

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన...

హంతకుల ఆచూకీని కనుగొనేందుకు పోలీసులు అనంతపురం నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. హత్య ప్రాంతం నుంచి పోలీసు జాగిలం.. ఒక్కటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న కుటాలపల్లికి వచ్చింది. గ్రామ నడిబొడ్డున ఉన్న అమరనాథ్‌రెడ్డి ఇంటికెళ్లింది. ఇంట్లో సంచరించిన అనంతరం తిరిగి హత్యా స్థలానికి చేరుకుంది.

వ్యక్తిగత కారణల వల్లే హత్య: ఎస్పీ

వ్యక్తిగత కారణాలతోనే అమరనాథ్‌రెడ్డి హత్య జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి ఆయన హత్యాస్థలాన్ని పరిశీలించారు. హత్య వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదనీ, వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగి ఉండవచ్చని అన్నారు. దర్యాప్తు చేసి, వాస్తవాలను వెల్లడిస్తామన్నారు. హత్య కేసును వెంటనే ఛేదించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

అండగా ఉంటాం: పల్లె

అమరనాథ్ రెడ్డి హత్య గురించి తెలియగానే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటాలపల్లికి వెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. పార్టీ, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డితో చర్చించారు. హత్య చేసినవారిని వెంటనే గుర్తించి, అరెస్టు చేయాలని కోరారు.

రాజకీయ కోణం ఉందా..?

అమరనాథరెడ్డి టీడీపీలో చురుకైన నాయకుడు. చాలా కాలం నుంచి పార్టీలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం కూడా ప్రచారానికి వెళ్లి వచ్చారు. దీంతో ఆయన హత్య వెనుక రాజకీయ కోణం ఉందా అన్న చర్చ సాగుతోంది. టీడీపీ నాయకుడి హత్యతో మండల ప్రజలు భయాందోళనలకు లోనవుతున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకుడు హత్యకు గురికావడంతో రాజకీయ కారణాలతోనే హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మాత్రం వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు. తమకు ఎవరితోనూ వ్యక్తిగత తగాదాలు లేవనీ, ఆస్తి గొడవలు కూడా లేవని బాధిత కుటుంబం అంటోంది.


విలపిస్తున్న అమరనాథ్ రెడ్డి భార్య

బెంగళూరు రోడ్డు ప్రమాదంలో
అనంత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం


మణికంఠ (ఫైల్)

దొమ్మసంద్ర, మార్చి 25: అనంతపురం నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జయం మణికంఠ (24) బెంగళూరులోని సర్జాపుర రోడ్డులో జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సర్జాపుర రోడ్డులోని డిమార్ట్ సమీపాన ఆదివారం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వేగంగా దూసుకొచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో మణికంఠ తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడు బెంగళూరులోని ఎంయూ సిగ్మా కంపెనీలో పనిచేస్తుండేవాడు. అత్తిబెలె ఆక్స్‌ఫర్డ్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సర్జాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని సర్జాపుర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదం జరిగిందని, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని వివరించారు. మణికంఠ తండ్రి జయం కృష్ణమోహన్ ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్‌లో పనిచేస్తున్నారు. కృష్ణమోహన్, అరుణ దంపతులకు మణికంఠ ఏకైక సంతానం. చేతికి వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. వారి కుటుంబ సభ్యులను ఆంధ్రజ్యోతి సిబ్బంది పరామర్శించారు. సోమవారం మధ్యాహ్నం మణికంఠ అంత్యక్రియలు పూర్తిచేశారు.

మోటార్లకు మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న రైతులు

- మద్దతు తెలిపిన టీడీపీ, సీపీఎం, రైతు సంఘం

తనకల్లు, మార్చి 25: మండలంలోని వంకపల్లి గ్రామంలో సోమవారం ఉదయం గుట్టుచప్పుడు కాకుండా విద్యుత్ మోటార్లకు మీటర్లు అమర్చే కార్యక్రమాన్ని షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ చేపట్టింది. రైతులకు తెలియకుండా ఏడు విద్యుత్ బోర్లకు మీటర్లను బిగించారు. విషయం తెలుసుకున్న వంకపల్లి గ్రామస్థులు, రైతులు, టీడీపీ, సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో మీటర్లు బిగించే కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కోటూరు, పరాకువాండ్లపల్లి, వంకపల్లి, నల్లచెరువు మండలంలోని బోనేపల్లి గ్రామాలనుంచి రైతులు పెద్దఎత్తున వంకపల్లి వద్ద మోటార్లకు మీటర్లు బిగిస్తున్న ప్రాంతానికి వచ్చి అడ్డుకున్నారు. బిగించిన మీటర్లు వెంటనే తొలగించాలని, లేదంటే ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. అక్కడే ఉన్న విద్యుత్ లైన్‌మన్, గ్రామస్థులు విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళన అధికంగా కావడంతో బిగించిన మీటర్లను తొలగించి, వెనక్కి వెళ్లిపోయారు. కార్యక్రమంలో టీడీపీ గుడిపల్లి రెడ్డెప్పరెడ్డి, చిన్నప్ప, దస్తగిరి, సీపీఎం శివన్న, సీఐటీయూ ఒంటెద్దు వేమన్న, రైతు సంఘం రమణ, వెంకటరమణ, రైతులు క్రిష్టారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, శేఖరప్ప, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మీటర్లు బిగించే కార్యక్రమాన్ని అడుకుంటున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు

కొడికొండ చెక్‌పోస్టులో భారీగా బంగారు, వెండి పట్టివేత

చిలమత్తూరు, మార్చి 25: బెంగళూరు నుంచి బళ్లారికి తీసుకెళుతున్న పెద్ద మొత్తంలోని బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టులో ప్రత్యేక పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఓ ప్రత్యేక వాహనంలో తీసుకెళుతున్న బంగారు, వెండి ఆభరణాలు పట్టుబడినట్లు తెలిసింది. వాటికి సంబంధించి సరైన వేబిల్లులు లేకపోవడంతో పట్టుబడిన ఆభరణాలతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వస్తువుల విలువ సుమారు. రూ.8 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. అయితే దీనిపై పోలీసులు వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు. పట్టుబడిన బంగారు, వెండి పెద్ద మొత్తంలో ఉండటంతో వాటిని ఆదాయ పన్నుల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇంత పెద్ద మొత్తంలో పట్టుబడిన బంగారు, వెండి ఆభరణాలను జిల్లా ట్రెజరీలోనే భద్రపరచాల్సి ఉంది. అయితే రవాణా చేస్తున్న బంగారు, వెండి వస్తువులను హైదరాబాదు నుంచి బళ్లారికి తీసుకెళుతున్నట్లుగా వేబిల్లులు ఉండగా, వాటిని బెంగళూరు నుంచి బళ్లారికి తీసుకెళుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది.


బంగారాన్ని తరలిస్తున్న వాహనం ఇదే..

మామపై దాడి కేసులో అల్లుడికి జైలు శిక్ష

బుక్కపట్నం, మార్చి 25: మామపై దాడిచేసి గాయపరచిన అల్లుడికి ఆరునెలలు జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ పుట్టపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ సురేష్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన శీనుకు అదే ఊరికి చెందిన వరలక్ష్మితో వివాహమైంది. 2013లో శీనుతో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లింది. తరువాత భార్య ఇంటికెళ్లి శీను.. మామ నారాయణతో గొడవపడ్డాడు. తన భార్యను ఇంటికి పంపాలని అడిగాడు. ఈ నేపథ్యంలో మామను కట్టెతో కొట్టడంతో అతడి కాలు విరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. దీనిపై విచారించిన జేఎఫ్‌సీఎం కోర్టు శీనుకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఎన్ఎంఆర్ ఉద్యోగిపై ఫిర్యాదు

తాడిపత్రి టౌన్, మార్చి 25: మున్సిపల్ కార్యాలయంలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్న జేసీ సూర్యనారాయణ రెడ్డిపై సోమవారం ఎన్నికల అధికారి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ రాంమోహన్‌కు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎన్ఎంఆర్ జేసీ సూర్యనారాయణరెడ్డి మున్సిపల్ ఉద్యోగిగా పని చేస్తూ వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెంట ఎన్నికల ప్రచారంతోపాటు ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ.. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించాడన్న దానిపై జేసీపీఆర్ ఫిర్యాదు చేశారు.


ఎమ్మెల్యే పెద్దారెడ్డితో ఎన్ఎంఆర్ జేసీ సూర్యనారాయణరెడ్డి

సీపీఎస్ రద్దుకు సహకరించాలి

- యూటీఎఫ్ నాయకుల డిమాండ్


జీపీఎస్ అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మార్చి 25: రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని యూటీఎఫ్ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ... రెండు దశాబ్దాల కాలంలో యూటీఎఫ్ స్వతంత్రంగా ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాల కార్యాచరణలోనూ మండల స్థాయి నుంచి ఢిల్లీస్థాయి వరకూ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించి సీపీఎ స్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించే విధంగా పునఃసమీక్షించాలని వారు కోరారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉపాధ్యాయులకు 10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్ సమయంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్‌వలి, శివశంకర్, లక్ష్మీనారాయణ, జీసీ నరేశ్, ఆడిట్ కమిటీ సభ్యుడు ఆజంబాషా పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 176974

RENTAL

26000 SqFt AREA SHED AVAILABLE NEXT TO BANGALORE - HINDUPUR - MAIN ROAD, HINDUPURAM (M) CONTACT: 9845010820.

AJA-176975

CHANGE OF NAME

I M Syam Sundar Reddy S/o Maddirala Ramasubba Reddy at #16/123-1, Sreenivasapuram, Tadipatri, Ananthapur Dist, A.P. Changed My Name As MADDIRALA SYAMA SUNDAR REDDY.

AJT - 10407

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్‌లకు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజ్ - ఏడీటీ

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, మార్చి 25: నగరంలోని రాణినగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన మేఘన (22) ఏడాది క్రితం అనంతపురానికి చెందిన కిషోర్‌ను కులాంతర ప్రేమ వివాహం చేసుకుంది. ప్రస్తుతం కిషోర్ ఓ సంస్థలో సేల్స్‌మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రాణినగర్‌లో వీరు నివాసముంటున్నారు. రెండు రోజుల కితం వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సోమవారం తన ఇంట్లోనే మేఘన ఉరి వేసుకుంది. వెంటనే గుర్తించిన కిషోర్ ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. కొంతసేపటికే ఆమె మరణించింది. మేఘన మృతిపై వన్‌టౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి పంచాయతన పూజ



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం, అలంకరణలో గాయత్రిమాత

అనంతపురం కల్చరల్, మార్చి 25: సోమనాథ్‌నగర్ కోదండ రామాలయంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం గాయత్రి పంచాయతన పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో గణపతి, హోమం, రుద్ర, నారాయణ, సౌర, చండీ, నవగ్రహ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం కాశీవిశ్వేశ్వరస్వామి, మహావిష్ణువు, వినాయకుడు, సూర్యభగవానుడి విగ్రహాలతో కూడిన గాయత్రి పంచాయతన విగ్రహానికి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, సభ్యులు రాఘవేంద్ర, నారాయణ నాయక్, మనూరు నాగరాజరావు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



చెన్నేకొత్తపల్లి, మార్చి 25: మండలంలోని ప్యాదిండి సమీపంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కదిరి పౌర్ణమి సందర్భంగా ఏటా ఇక్కడ స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారి నామస్మరణతో మార్మోగింది. పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి పంజుసేవ నిర్వహించారు. స్థానికులే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా మలోబుల లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, మార్చి 25: మండలంలోని పంపనూరు కొండపై వెలసిన మలోబుల లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు. వేలాదిమంది భక్తులు ఇందులో పాల్గొన్నారు. కాగా, కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. కనీసం తాగునీరు సౌకర్యమూ కల్పించలేదు.

ఐక్యవేదిక రాష్ట్ర కో-చైర్మన్‌గా హరికృష్ణ



అనంతపురం విద్య: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కో చైర్మన్‌గా తనను ఎంపిక చేసినట్లు ఎన్టీపీ రాష్ట్ర అధ్యక్షులు, ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగిన సమావేశంలో తనను ఎంపిక చేశారన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగ, పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై శాస్త్రీయ శోధ న, పరిష్కార సాధన దిశగా ఐక్యవేదిక పనిచేస్తుందన్నారు. ఓపీఎస్ పునరుద్ధరణే అంతిమ లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. హరికృష్ణకు ఐక్యవేదిక కో చైర్మన్‌గా అవకాశం ఇవ్వడంతో ఎన్టీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర నాయకు లు రాంభూపాల్‌రెడ్డి, వెంకటేష్ బాబు, బాలసుబ్రహ్మణ్యం హర్షంవ్యక్తం చేశారు.

రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఇంట్లో డిఫెన్స్ లిక్కర్

303 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్న సెబ్



రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఇంట్లో స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ లిక్కర్

అనంతపురం క్రైం, మార్చి 25: అనంతపురం నగరంలో రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఇంట్లో డిఫెన్స్ లిక్కర్ పట్టుబడింది. రూ.5.50 లక్షల విలువైన 303 డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నార్పల మండలం తుంపెర గ్రామానికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఎన్.హనుమంతరెడ్డి, అనంతపురం నగర శివారులోని శిల్పా లేపాక్షి నగర్‌లో ఉంటున్నారు. బెంగుళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో తను, తన సహచర రిటైర్డ్ జవాన్ల ద్వారా కొనుగోలు చేసిన లిక్కర్ బాటిళ్లను అనంతపురానికి తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ ఆదివారం రాత్రి తన సిబ్బందితో కలిసి హనుమంతరెడ్డి ఇంటిపై దాడులు నిర్వహించారు. మధ్యవర్తుల సమక్షంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సెబ్ ఏఎస్పీ తెలిపారు.

విదేశీ మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం: నగరంలోని హమాలీకాలనీలో టూటౌన్ పోలీసులు విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అనం తపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో సీఐ క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి టూటౌన్ పోలీసులు హమాలీకాలనీలో దాడులు నిర్వహించారు. ఓ అపార్ట్‌మెంట్‌లో నిల్వ ఉంచిన వివిధ బ్రాండ్లకు 39 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో డిఫెన్స్ లిక్కర్, ఫారిన్ లిక్కర్ బ్రాండ్లు ఉన్నాయి. నింది తుడు భరత్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. బెంగుళూరులోని ఆర్మీ క్యాంటీన్ నుంచి కొను గోలు చేసి అక్రమంగా అనంతపురం తరలించినట్లు విచారణలో తేలింది. మాజీ సైనికుద్యోగుల కార్డులను సేకరించి బెంగుళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి ఇక్కడ వాటిని అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకు నేవాడు. ఫారిన్ బ్రాండ్ మద్యం కూడా బెంగుళూరులో కొని ఇక్కడికి అక్రమంగా తీసుకొచ్చాడు. దాడుల్లో ఎస్ఐలు రుష్యేంద్రబాబు, సలామ్‌ఖాన్ పాల్గొన్నారు.

వేపకుంటలో కర్ణాటక మద్యం..

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలంలోని వేపకుంట గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 1056 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆ మద్యం విలువ రూ. 70 వేలు ఉంటుందని, ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనంతపురం క్రైం: నగరంలో షికారి కొట్టాలకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి అతని నుంచి 29 టెట్రా ప్యాకెట్లు, 10 క్లాసిక్ బ్లూ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

రామగిరి: కనగానపల్లి మండలం మద్దెలచెరువు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 200 టెట్రాప్యాకెట్లను స్కూటీలో తరలిస్తుండగా మండలంలోని ఎగువపల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు రామగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

రాప్తాడులో టీడీపీదే గెలుపు

అంతటా వైసీపీపై వ్యతిరేకత కనిపిస్తోంది : పరిటాల సునీత



చెన్నమనాయునికోటలో కరపత్రాలను పంచుతున్న పరిటాల సునీత

ధర్మవరంరూరల్, మార్చి 25: రాప్తాడు నియోజకవర్గంలో ఈసారి తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కనగానపల్లి మండలంలోని గుంతపల్లి, తగరకుంట, తూముచెర్ల, చెన్నమనాయుని కోట గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారెంటీ పథకాల కరపత్రాలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నా.. అనేక మందికి పథకాలు అందలేదన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రచారంలో ఒకటి.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేసింది మరొకటని విమర్శించారు. రాజకీయంగా ఏమైనా గొడవలు ఉంటే తమలాంటివారితో చూసుకోవాలే కానీ.. అమాయక ప్రజలను ఇబ్బంది పెట్టారని అన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలేది లేదన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి గత ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి దొంగ ఓట్లు ఎక్కించి ఎన్నికల్లో గెలిచారన్నారు. ఎన్నికల అనంతరం సొంత కార్యకర్తలను కూడా పట్టించుకున్న పాపన పోలేదన్నారు. తోపుదుర్తి సోదరులు నియోజకవర్గంలో దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకుని పాలన సాగించారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, తెలుగు యువత బట్టా సురేష్ చౌదరి, సర్పంచ్ మాధవరాజు, రామాంజి, సోమర చంద్రశేఖర్, రామాంజి, బోదులస్వాతి, రాములమ్మ, గిరిశాలఅరుణ, స్రవంతి, జయశంకర్, మల్లికార్జున, పూజారి రాజాకృష్ణ, బిల్లేదాము పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి : కనగానపల్లి మండలంలోని తూముచెర్ల, గుంతపల్లి గ్రామాల్లో పలువురు వైసీపీ నాయకులు పరిటాలసునీత ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. గుంతపల్లి, తగరకుంట గ్రామాల్లో ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

టీడీపీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని టీడీపీ నాయులు పేర్కొన్నారు. చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత అభివృద్ధి సాధ్యమౌతుందని వారు పేర్కొన్నారు. శింగనమల, రాప్తాడు నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థుల తరపున సోమవారం విస్తృత ప్రచారం చేశారు. నార్పల మండంలోని గుంజెపల్లి, నల్లపరెడ్డిపల్లి గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు.

\- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు



గుంజేపల్లిలో ప్రచారం చేస్తున్న ఆలం నరసానాయుడు



చెన్నేకొత్తపల్లి మండలం ఆమిదాలకుంటలో, రామగిరి మండలం కలికివాండ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



ఆత్మకూరు మండలం సనపలో.., రాప్తాడు మండలం ఎం. చెర్లోపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో.., శింగనమల మండలం సలకంచెరువులో టీడీపీ నాయకుల ప్రచారం

బకాయిలు విడుదల చేయాలి: ఆపస్

అనంతపురం విద్య, మార్చి 25 : ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరలోని ఆ సంఘం కార్యాలయంలో అనంతపురం, సత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి శ్రవణ్‌కుమార్ మాట్లాడారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లో రాతపూర్వకంగా ఇచ్చిన మేరకు ఈ నెల 31 లోగా ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. అనంతపురం జిల్లాలో ఇంగ్లీష్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, బదిలీల్లో కోరుకున్న స్థానానికి పంపాలని, అప్‌గ్రేడ్ అయిన స్కూళ్లకు పీడీలు, హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఇవ్వాల్సిన అరియర్స్ అన్నీ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు నారాయణస్వామి, అనంతపురం జిల్లా అధ్యక్షులు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అమరాచంద్రబాబు, ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, ఇతర నేతలు భాస్కరయ్య, గోపీచంద్, హర్షవర్ధన్, నాయుడు, రమేష్, ఉమామహేశ్వర్, స్రుజనారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు

బాధిత మహిళకు 'అమ్మ' చేయూత

అనంతపురం కల్చరల్: ప్రమాదంలో గాయపడిన రాజస్థానీ మహిళ ఆపరేషన్ నిమిత్తం అమ్మ సంస్థ ఆర్థిక సాయం చేసి అండగా నిలిచింది. రాజస్థాన్‌కు చెందిన హొరాసింగ్, లక్ష్మీబాయి దంపతులు తమ కుమారుడు చైతన్‌సింగ్‌తో కలిసి బతుకు తెరువు కోసం అనంతపురం వలస వచ్చారు. రైల్వేస్టేషన్ సమీపంలో జిలేబీలు, సమోసాలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిరో జుల క్రితం లక్ష్మీబాయి ఇంట్లో కాలు జారి మెట్లమీద పడింది. దీంతో ఆమెకు వెన్నెముక దెబ్బతినడంతోపాటు కాలు విరిగింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న ఆమెకు వెన్నెముక ఆపరేషన్ చేయడంతో పాటు కాలుకు రాడ్లు వేసేందుకు రూ.2.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. ఆపరేషన్ కోసం వా రు రూ.లక్ష సమకూర్చుకోగా మిగిలిన రూ.1.5 లక్షల కోసం దాతల సాయం కోసం అమ్మ సంస్థను సంప్రదించారు. స్పందించిన అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి సోమవారం ఆస్పత్రికి చేరు కుని బాధితురాలి కుటుంబానికి రూ.1.5 లక్షలు అందజేయడంతోపాటు కర్నూలు వెళ్లేందుకు అంబులెన్సును సైతం సమకూర్చారు.

హిజ్రాల ముసుగులో బలవంతపు వసూళ్లు వద్దు: డీఎస్పీ

అనంతపురం క్రైం : హిజ్రాల ముసుగులో దౌర్జన్యాలు, బలవం తపు వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి స్పష్టం చేశారు. అనంతరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలిసి అనంతపురం డీఎస్పీ సోమవారం మీడియాతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు, గొడవలకు దిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అనంతపురంలో ఉంటున్న హిజ్రాలు ఆసిఫ్, బద్రి గ్రూపుల మధ్య తగాదాలు నెలకొన్నాయన్నారు. దీంతో కొంతకాలంగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటూ, కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులు తమకు న్యాయం చేయలేదంటూ పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ, అసభ్యంగా ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు, పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఆర్టీసీ బస్టాండ్, తారక రామ కొట్టాల ప్రాంతాల్లో అక్రమంగా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న ట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఒక్కో గ్రూప్‌కు ఒక్కో రోజు అనుమతి ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు ఎప్పుడూ చట్టపరంగా వ్యవహరిస్తారని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సపోర్టు చేయబోరని అన్నారు.

నాలుగు టిప్పర్లు సీజ్

రాప్తాడు : అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సోమవారం సీజ్ చేసినట్లు రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు. మండలంలోని హంపాపురం సమీపంలోని గుట్టలో నుంచి అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తుండటంతో వాటిని సీజ్ చేసి రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

పశుగ్రాసం దగ్ధం

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలం భానుకోటలో బోయకుమార్, ముని రాజ్‌లకు సంబంధించిన వేరుశనగ కట్టెకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయిందని, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

వైసీపీకి రాజీనామా చేస్తాం

- పార్టీ కోసం పనిచేసినా ఎమ్మెల్యే పట్టించుకోలేదు
- వైసీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి రాజారామ్

రాప్తాడు, మార్చి 25: కష్టకాలంలో వైసీపీకి పని చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పట్టించుకోలేదని, అందుకే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నామని వైసీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి బోయ రాజారామ్ అన్నారు. అనంతపురం నగరంలోని యాదవ కళ్యాణ మంటపంలో వైసీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గ నాయకులు సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కష్టకాలంలో వైసీపీ కోసం పనిచేస్తే తమకు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే ఎస్సీ, ఎస్టీ, బీసీలను పట్టించుకోవడం లేదని, ఎమ్మెల్యే తన సొంత సామాజికవర్గీయులకే పనులు చేసిపెడుతున్నారని ఆరోపించారు. అందుకే వైసీపీలో తాము ఉండలేమని స్పష్టం చేశారు. ఈ నెల 27న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల సమావేశం నిర్వహించి, దాదాపు వెయ్యి కుటుంబాలు పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. వైసీపీకి పనిచేసి ఆర్థికంగా నష్టపోయామని అన్నారు. రాజీనామా తరువాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో వైసీపీ కురుబ సంఘం జిల్లా కార్యదర్శి బిల్లే నరేంద్ర, వైసీపీ విద్యార్థి విభాగం ఎస్కేయూ అధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్యకు వైసీపీదే బాధ్యత



ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబ సభ్యులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 25: కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో చేనేత కుటుంబ ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కుటుంబ సభ్యులకు నివాళులు అర్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.... బడుగు, బలహీన వర్గాలను హత్య చేయడమే జగన్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. చేనేత కుటుంబానికి చెందిన కొద్దిపాటి భూమిని వైసీపీ నాయకులు అక్రమంగా కబ్జా చేయడంతోనే ఆ కుటుంబ ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. చేనేత కుటుంబ సభ్యుల ఆత్మహత్యకు కారణమైన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోవు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపడం ఖాయ మన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, నాయకులు వన్నూరు, పోతుల లక్ష్మీనరసింహులు, అదిశేషు, కురబ నారాయణస్వామి, మాధవి, పెద్దన్న, చౌడయ్య, పరశురాం, ఓబుళపతి, నారాయణ స్వామి, చంద్రాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మాదిగల సంక్షేమం



చంద్రబాబు, మందకృష్ణ మాదిగతో కదిరప్ప

అనంతపురం సెంట్రల్, మార్చి 25: మాదిగల సంక్షేమం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారు కదిరప్ప పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో కలిసి టీడీపీ అధినేత నారా చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌డీఏ కూటమికి మద్దతు ప్రకటన పురస్కరించుకుని చంద్రబాబును కలిసినట్లు వివరించారు.

అపుస్మా రాష్ట్ర నాయకుడు రామిరెడ్డి మృతి



అనంతపురం విద్య, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) స్టేట్ చీఫ్ కో-ఆర్డినేటర్, రుద్రంపేట బాలాజీ విద్యామందిర్ కరస్పాండెంట్ రామిరెడ్డి సోమవారం మరణించారు. ఉన్నపలంగా గుండెపోటు రావడంతో ఆయను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్యకు, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. బంధువులు, ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్లు, అపుస్మా ఇతర సంఘాల నేతలు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి మాట్లాడుతూ.... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

స్పిరిట్ ఫ్యాక్టరీ వద్దు

రేకలకుంట గ్రామ రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

బుక్కరాయసముద్రం, మార్చి 25: మండలంలోని రేకలకుంట గ్రామం వద్ద స్పిరిట్ తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని ఆ గ్రామ రైతులు ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. కొన్ని సంవత్సరాలుగా ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకూడదని ఆ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఇక్కడ అనుమతులు ఇవ్వరాదని 2013 నుంచి ఫ్యాక్టరీ యాజమాని జేసీ రవీంద్రారెడ్డికు ఆ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు మధ్య వివాదం నడుస్తోంది. రైతులు 2017లో కోర్టును ఆశ్రయించి ఫ్యాక్టరీ నిర్మాణపు పనులు నిలుపుదల చేయాలని స్టే తెచ్చారు. కాగా, ఆ నిర్మాణపు పనులు ప్రారంభించేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం సోమవారం సిద్ధమయ్యారు. దీంతో రేకలకుంట గ్రామ ప్రజలు, రైతులు ఒక్కసారిగా ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. కోర్టులో స్టే ఉండగా న్యాయస్థానం ఉత్తర్వులు ఉల్లఘించి నిర్మాణపు పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే నిర్మాణపు పనులు ఆపకపోతే... ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌ను రెండు రోజుల్లో కలిసి సమస్యపై వినతి పత్రం ఇస్తామన్నారు.


విద్యార్థుల మేనిఫెస్టో విడుదల

అనంతపురం కల్చరల్/క్లాక్‌టవర్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యార్థుల మేనిఫెస్టోను స్థానిక ఏఐడీఎస్‌ఓ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి మహేష్ సోమవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... ఏటా విద్యకు బడ్జెట్‌ను తగ్గిస్తున్నారని, దీంతో ప్రభుత్వ విద్యాసంస్థలు నిధుల లేమితో సతమతమవుతున్నాయని అన్నారు. మరోవైపు ప్రైవేట్ యాజమాన్యాలు డబ్బు సంపాదించే పరిశ్రమలుగా తయారయ్యాయన్నారు. విద్యను పూర్తిస్థాయిలో వ్యాపారం చేస్తూ ప్రభుత్వాలు తెస్తున్న విధానాలు విద్యారంగాన్ని దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విద్యావిధానం-2020 విద్యను మరింత ప్రైవేటీకరణ చేస్తూ.. కాషాయీకరణను ప్రోత్సహిస్తోందని వాపోయారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన డిమాండ్లను పొందుపరుస్తూ విద్యార్థుల మ్యానిఫెస్టోను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ నగరాధ్యక్షుడు సురేష్, మొహమ్మద్, చరణ్‌తేజ్ పాల్గొన్నారు.

'షెడ్యూల్డ్ కులాల' జిల్లా కార్యవర్గం ఏర్పాటు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 25: ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. సోమవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రత్నప్రదీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ మోహన్, సహాధ్యక్షుడిగా పాల్, కోశాధికారిగా నరేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా రవీంద్ర, సంపత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసులను ఎన్నుకున్నారు.

నెలన్నర అయినా.. ఇంకా పాత డీఈఓ ఫొటోనే



అనంతపురం విద్య, మార్చి 25: అనంతపురం జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) విభాగం అధికారులు మొద్దునిద్ర వీడటం లేదు. డీసీఈబీ అధికారి జిల్లా వెబ్‌సైట్‌లో నేటికీ పాత డీఈఓ ఫొటోనే కొనసాగిస్తున్నారు. ఫిబ్రవరి ఆరున జిల్లా విద్యాశాఖాధికారిగా వరలక్ష్మిని నియమిం చారు. ఆమె జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యలు తీసుకుని కూడా నెలన్నర దాటింది. పూర్వపు డీఈఓ నాగరాజు ఎండీఎం ఏడీగా వ్యవహరిస్తున్నారు. డీఈఓనే జిల్లా సాధారణ పరీక్షల మండలి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అయితే కొత్త డీఈఓ వచ్చినా.. డీసీఈబీ అధికారులు మింగుడుపడినట్టు లేదు. గతంలో డీఈఓగా వ్యవహరించిన నాగరాజు ఫొటోనే డీసీఈబీ అధికార వెబ్‌సైట్‌లో కొనసాగిస్తుండటంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం రూరల్: ఎస్సీ విద్యార్థి సంఘం నాయకుడు వేమన్నపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేమన్నను పరామర్శించిన వారు మాట్లాడారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నగరం లోకి రాకుడదంటూ ఓ వర్గం వారు వేమన్నను కొట్టి గాయపరిచారన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న, ఎంఆర్‌పీఎస్ నాయకులు కేవీ నారాయణస్వామి, చిన్న పెద్దన్న, ఓబులేసు, సత్యమయ్య, మురళి, శివయ్య, హనుమంతు, ఎస్కేయూ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే విద్యావ్యవస్థ బాగు

● కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ● గ్రామాల్లో విస్తృత ప్రచారం



అమిలినేని సురేంద్రబాబును సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాల కరెస్పాండెంట్లు



శెట్టూరు మండలం మాకొడికితండా గ్రామంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 25: రాష్ట్రంలో విద్యావ్యవస్థ బాగుపడాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని ప్రైవేటు పాఠశాల కరెస్పాండెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కళ్యాణదుర్గంలో టీడీపీకి మద్దతివ్వాలని ప్రైవేటు పాఠశాల కరెస్పాండెంట్లను కోరారు.

కంబదూరు మండలం కోటగుడ్డం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గొల్ల ప్రకాష్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న సురేంద్రబాబు గ్రామానికి వెళ్లి బాధితున్ని పరామర్శించారు.

శెట్టూరు మండలం మాకొడికి తండా గ్రామస్థుల ఆహ్వానం మేరకు హోలీ ఉత్సవాల్లో అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. మహిళలు, గ్రామస్థులు, పిల్లలతో సరదాగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు హంపన్న, హరి, నరసింహులు, సురేష్, నాగేంద్రలు టీడీపీలోకి చేరారు. వీరందరికీ అమిలినేని సురేంద్రబాబు అల్లుడు నవీన్‌చౌదరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని 19వ వార్డులో అమిలినేని సురేంద్రబాబు కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రోడ్లు, డ్రైనేజీలను బాగుచేసి, ఆదర్శ మున్సిపాల్టీగా మారుస్తామని, ప్రతి ఒక్కరు టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ మనమందరం కలసికట్టుగా పోరాడి తిరిగి చంద్రన్న రాజ్యాన్ని సాధించుకుందామన్నారు. మన ప్రాంతం, మన ఊరు భావి తరాల భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చేసి చూపిస్తా: అమిలినేని

బ్రహ్మసముద్రం: నియోజకవర్గంలో ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వంక తండా గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను గ్రామస్థులకు అందించి ఓటును అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తాననన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు, టీడీపీ నాయకులు రాజగోపాల్, యశ్వంత్ చౌదరి, మాజీ సర్పంచ్ తిమ్మప్ప చౌదరి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన జేడీ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 25: పట్టణంలో దొడగట్ట రోడ్డులో ఉన్న ఎస్సీ బాయ్స్ నెంబర్ 2, ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతిగృహం నెంబర్ 1, 2 లను సోమవారం సాయంత్రం సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్ రావు తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి మెట్టు అని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ దామోదర్ రెడ్డి, ఎంఈవో శ్రీధర్, వార్డెన్లు నాగరాజు, సూరాంజినేయులు, ఓబుళమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ, మార్చి 25: ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉరవకొండ, విడపనకల్లు పాఠశాలల ప్రిన్సిపాళ్లు ప్రశస్త కుమారి, గంగాధర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపు లు ఆంగ్లమధ్యమంలో ఉన్నాయన్నారు. ఉచిత విద్య కోరుకునే అభ్యర్థులు ఈ నెల 28నుంచి మే22 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ, ఈడబ్ల్యూ ఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఉంతకల్లు రిజర్వాయర్ ఊసే ఎత్తని జగన్: కాలవ



సెల్ఫీ తీసుకుంటున్న కాలవ శ్రీనివాసులు



టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలవ

రాయదుర్గం, మార్చి 25: హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల సాగునీటి కష్టాలు తీర్చే ఉంతకల్లు రిజర్వాయర్ ఊసెత్తకుండా సీఎం జగన్ కాలం గడుపుతున్నాడని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజీలో భాగంగా ప్రతిపాదిత ఉంతకల్లు రిజర్వాయరుపై సోమవారం ఆయన చివరి సెల్ఫీ దిగారు. ఉంతకల్లు రిజర్వాయర్ పూర్తయితే జిల్లాలో ఎక్కడ తాగునీటి అవసరం ఏర్పడినా ఇక్కడి నుంచే నీటిని సరఫరా చేసే అవకాశం ఉండేదన్నారు. రిజర్వాయరు నిర్మాణానికి 2016 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ. 1180 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఉంతకల్లు రిజర్వాయరుపై కనీస శ్రద్ధ కనపరచకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవగానే ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని కాలవ హామీ ఇచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

డీ.హీరేహాళ్: మండలంలోని హిర్దేహాళ్ గ్రామానికి చెందిన 27 వైసీపీ కుటుంబాలు సోమవారం కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరాయి. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, వైసీపీ వార్డు మెంబర్ నాగరాజు, గంగిరెడ్డి, నాగేంద్ర, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, తిప్పేష్, మల్లయ్య, అర్జున తదితర 27 కుటుంబాల వైసీపీ నాయకులు రాయదుర్గంలోని కాలవ శ్రీనివాసులు స్వగృహంలో టీడీపీలో చేరారు.

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సమక్షంలో సోమవారం వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ సర్పంచ్ బెళ్లి హనుమంతరెడ్డి, గాలి బసప్ప ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన గోనేహాళ్ వన్నూరుస్వామి, గొల్ల హను మంతరాయ, పూజారి గోవిందప్ప, హనుమేష్, నాగేంద్ర, తుంబిగనూరు వన్నూరుస్వామి మరో 45 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

● మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిను కాలవ సోమవారం దర్శించుకున్నారు.

టీడీపీతోనే భైరవాన్‌తిప్ప అభివృద్ధి

గుమ్మఘట్ట: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన భైరవాన్‌తిప్పా అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం గుమ్మఘట్టలో 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు.

టీడీపీతోనే సంక్షేమం

రాయదుర్గం రూరల్, మార్చి 25: రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతాయని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామంలో ప్రచార కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి తిరుగుతూ సైకిల్‌గుర్తుకు ఓటేయాలని కోరారు.



చదం గొల్లలదొడ్డిలో ప్రచారం చేస్తున్న కాలవ భరత్

కోడ్ వచ్చినా బరితెగింపా?

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్

గుంతకల్లు, మార్చి 25: ఎన్నికల కోడ్ వచ్చినా వైసీపీ నాయకుల ఆగడాలు అదుపులోకి రాకపోవడం శోచనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లుగా రాష్ట్రంలో బీసీలు, దళితులపై వైసీపీ నాయకుల దాడులు మితిమీరి జరిగాయన్నారు. కనీసం ఎన్నికల కోడ్ వచ్చాకైనా వారి దౌర్జన్యాలు తగ్గకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కడప జిల్లాలో తనకున్న మూడెకరాల భూమిని రికార్డులు తారుమారుచేసి వైసీపీ నాయకులు లాగేసుకోవడంతో సుబ్బారావు అనే వ్యక్తి తన కుటుంబంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. నంద్యాలలో అబ్దుల్ సలాం అనే ముస్లిం కుటుంబాన్ని కూడా ఇలాగే బలితీసుకున్నారన్నారు. ముఖ్య మంత్రి జగన్ సొంత జిల్లాలోనే ప్రజల ధన, మాన, ప్రాణా లకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించి ఇంటికి పంపుతారన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు సంజీవరాయుడు, బొజ్జే నాయక్, కేవల్ సీన పాల్గొన్నారు.

పనిచేసిన వారికే టిక్కెట్టు

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్

గుంతకల్లు, మార్చి 25: కష్టకాలంలో పార్టీకి పని చేసినవారికే అధిష్టానం తప్పక టిక్కెట్టును కేటాయిస్తుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ పేర్కొన్నా రు. సోమవారం ఉదయం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ టిక్కెట్టును ప్రకటించడంలో ఆలస్యం జరిగినందున పార్టీ శ్రేణుల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని పార్టీ ప్రకటించే అవకాశం ఉందని కార్యకర్తలు ఆందోళన చెందరాదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సంజీవరాయుడు, బొజ్జే నాయక్, కేవల్ సీన పాల్గొన్నారు.

జితేంద్రగౌడే తగిన అభ్యర్థి

స్థానిక అసెంబ్లీ అభ్యర్థిగా జితేంద్రగౌడే తగిన అభ్యర్థి అని, ఆయనకే టిక్కెట్టును కేటాయించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పట్టణంలోని మస్తాన్‌వలి దర్గాలో జితేంద్రగౌడు ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా దర్గాకు చాదర్‌ను సమర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ జితేంద్రగౌడుకు టిక్కెట్టు ఇస్తే తప్పక గెలుపు సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కౌన్సిలరు గుడిపాటి ఆంజనేయులు, తలారి మస్తానప్ప, కేశప్ప, హనుమంతు, పాల మల్లికార్జున, ఫ్రూట్ మస్తాన్, ఆటో ఖాజా, పజులు, ఇస్మాయిల్, శివన్న, శివప్ప, జగన్నాథ్, చికెన్ జగన్, కే చంద్రశేఖర్, కే సురేశ్, రాయల్ వెంకటేశులు, మాధవి, ఓ రామాంజనేయులు, కేసీ రామాంజనేయులు, డీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం

బెళుగుప్ప, మార్చి 25: మండలంలోని విరుపాపల్లిలో సోమవారం టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై స్థానిక నాయకులు ఇంటింటా తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు హెచ్ రమేష్, ఓబుళప్ప, రమేష్, రాధాకృష్ణ తదితరులు కోరారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 25: మండలంలోని విట్లంపల్లి బస్టాండ్ వద్ద ఓ రకం జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 3250, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా సిద్ధారూఢస్వామి మహోత్సవం

రాయదుర్గంరూరల్, మార్చి 25: మండలంలోని కెంచానపల్లి గ్రామంలో సోమవారం సిద్ధారూఢస్వామి మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. రథాన్ని అందంగా అలంకరించి సిద్ధారూఢస్వామి ప్రతిమను రథంలో ప్రతిష్ఠించి గ్రామవీధుల్లో భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం సిద్ధారూఢస్వామి మఠంలో దేవి పురాణం పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పొట్ల రవికుమార్, పొట్ల వేణుగోపాల్, పొట్ల చంద్రకాంత్‌నాయుడుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనందవల్లి అమ్మవారి జయంతి

తాడిపత్రిటౌన్, మార్చి25: పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం ఆనందవల్లి అమ్మవారి జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు తిరుమంజనసేవ, ప్రత్యేక అలంకరణ నిర్వహించి పూజలు చేశారు. సాయంత్రం చింతల వెంకటరమణుడికి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కొలువుదీరిన ఉత్సవమూర్తులు

రంగురించిన సంబరం

జీవితం ఓ రంగుల ప్రపంచం
ఆ రంగుకు సంతోషమే నీటిని చేరిస్తే
సప్తవర్ణ శోభితమైన హరివిల్లులా మారింది.
ఆ ఇంద్రధనుస్సు రంగుల్లో
చిన్నా పెద్దా తేడా లేకుండా మునగడంతో
రంగుల హోళీ అయ్యింది.
వేసవి ఉక్కపోతతో అల్లాడే జనానికి
చల్లని రంగునీళ్లు
వసంత రుతు ఆగమన ఆహ్లాదాన్ని కలిగించాయి.
గూడు కట్టిన ఆనందానికి సరికొత్త వన్నెలద్దాయి.

తాడిపత్రిటౌన్/గుంతకల్లు టౌన్/ ఉరవకొండ/ రాయదుర్గం రూరల్, మార్చి25: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం హోలీ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. వీధుల్లో పెద్దలు, చిన్నారులు, యువకులు, మహిళలు రంగులను ఒకరిమీద ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందంగా గడిపారు.



కేరింతలు కొడుతున్న చిన్నారులు(తాడిపత్రి టౌన్)



హోలీ వేడుకల్లో చిన్నారులు(ఉరవకొండ)



రంగులు చల్లుకుంటున్న భావసార క్షత్రియ కుల సోదరులు (గుంతకల్లు టౌన్)



రంగులతో పిల్లలు (రాయదుర్గం రూరల్)

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం

యాడికి, మార్చి 25: చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతపురం, కడప, కర్నూలు తదితర జిల్లాల నుంచి వచ్చిన వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకు న్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య స్వామివారిని దర్శించుకున్నారు.

రథోత్సవం.. నేత్ర పర్వం

శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం అనంతరం స్వామి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఆలయ నుంచి స్థానిక కెనరా బ్యాంక్ వరకు లాగారు. భోజన విరామం అనంతరం రథాన్ని పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, వైశ్యావీధి, పెద్దమ్మ ఆలయం వీధుల గుండా నిర్వహించారు. గోవింద నామస్మరణతో యాడికి వీధులు మార్మోగాయి.



శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి



స్వామివారి రథోత్సవం

నేడు రాతిదూలం లాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

యాడికిని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా: జేసీపీఆర్

యాడికి, మార్చి25: యాడికిని గతంలో కంటే మరింత ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తానని తాడిపత్రి టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం యాడికిలో సులేమాన్ ఆధ్వర్యంలో 30ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరాయి. తాంద్ర విక్రమ్ ఆధ్వర్యంలో జక్కా రామయ్య తదితర 20 చేనేత కుటుంబాలు పార్టీలో చేరాయి. అనంతరం జేసీపీఆర్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో యాడికిని అభివృద్ధి చేశానని తెలిపారు. ఈసారి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే యాడికిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. ఎవరూ ఊహించనంతగా యాడికిని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. యాడికిలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారన్నారు. వారు నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చేనేత కార్మికులు నేసిన పట్టుచీరల విక్రయాలు అన్నీ ఇక్కడే కొనసాగేలా యాడికిని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆయన వెంట క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తిరంపురం నీలకంఠ, ఆది నారాయణ, రాజశేఖర్, మనోహర్ చౌదరి, మధురాజు, నారాయణ స్వామి, లక్ష్మణ్, సుబహాన్, రామచంద్ర, రామకృష్ణ, రామచంద్రారెడ్డి ఉన్నారు.



పార్టీలో చేరిన ముస్లింలతో జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిలో భవిష్యత్తు గ్యారెంటీ

తాడిపత్రిటౌన్, మార్చి25: పట్టణంలోని సుంకులమ్మపాలెం, తూర్పుపాలెంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అబ్దుల్ హై ఖాద్రి కుటుంబ సభ్యులతో భేటీ

పట్టణంలో ప్రభుత్వ ఖాజీగా పని చేసిన దివంగత సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రి కుటుంబసభ్యులను సోమవారం జేసీ అశ్మిత్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం టీడీపీకి అండగా నిలవాలని వారిని జేసీ అశ్మిత్‌రెడ్డి కోరాడు. దీనికి వారు తమ సంపూర్ణ మద్ధతు ఉంటుందని వారు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ షెక్షావలి, అనిఫ్ తదితరులు ఉన్నారు.



అబ్దుల్ కుటుంబ సభ్యులతో జేసీ అశ్మిత్‌రెడ్డి

ఏ అమ్మ బిడ్డో..!

నవజాత శిశువు లభ్యం



నవజాత శిశువు

రాయదుర్గం, మార్చి 25: ఏ తల్లి పేగు తెంచుకుని పుట్టిందో తెలియదు కానీ ఆ శిశువు రోడ్డు పక్కన అనాథగా మారింది. వారం రోజుల వయస్సు ఉన్న ఆ శిశువు ఏడుపును విన్న చుట్టు పక్కల వారు గమనించి దగ్గరకు తీసుకున్నారు. కన్నతల్లి కోసం వెతికారు. కనిపించకపోయే సరికి పోలీసులకు సమాచారమిచ్చి శిశువును వారికి అప్పగించిన సంఘటన సోమవారం రాయదుర్గంలో జరిగింది. పట్టణంలో ప్రధాన రహదారిలో ఉన్న ముదుగులమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఏడురోజుల వయస్సు ఉన్న నవజాత ఆడశిశువు ఏడుస్తూ ఉంది. ఏడుపు విన్న వెంటనే స్థానికులు అక్కడకు వెళ్లి శిశువును ఎత్తుకుని తల్లి కోసం గాలించారు. ఎవరూ లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ వచ్చి శిశువును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు శిశువును సంరక్షించే బాధ్యత అప్పగించారు.

శిశువు 1.7 కిలోల బరువు మాత్రమే ఉండడంతో వైద్యం అందించడానికి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించనున్నట్లు సీఐ ప్రసాద్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ తెలిపారు.

తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 25: నియోజకవర్గంలో ఉన్న ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను సోమవారం అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారు. ఆర్డీవో రాణి సుష్మిత శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో ఉన్న చెక్‌పోస్టును పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు. బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వహించకుండా విధులు చేపట్టాలని, లేనిపక్షంలో వేటు తప్పదని హెచ్చరించారు.

అగ్నికి ఆహుతైన శ్రీగంధం చెట్లు

తాడిపత్రిటౌన్, మార్చి25: మండలంలోని తలారిచెరువు గ్రామ సమీపంలో ఆదివారం 100శ్రీగంధం చెట్లు, డ్రిప్పు పరికరాలు, పైపులు, వాల్స్ అగ్నికి ఆహుతయ్యాయని రూరల్ పోలీసులు తెలిపారు. కడపజిల్లా కొండాపురం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన కిషోర్‌రెడ్డి కొంతకాలంగా తాడిపత్రిలో నివాసం ఉంటున్నాడు. మూడేళ్లక్రితం తలారిచెరువు వద్ద పొలాన్ని కొనుగోలు చేసి 2.75ఎకరాల్లో 750శ్రీగంధం చెట్లు నాటాడు. మూడు సంవత్సరాల్లో కొద్దిమేర చెట్లు పెరిగాయి. ఈ సంఘటనలో దాదాపు రూ.20లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. పొలానికి ఆనుకొని ఉన్న బాలదస్తగిరి అనే రైతు నిప్పుపెట్టి ఉంటాడని బాధితుడు కిషోర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు T. లక్ష్మి దేవమ్మW/o తలారి వన్నూరప్ప అను పేరున గల ఆస్తి తాకట్టుపై T. ధన అంజనేయులు S/o T. వన్నూరప్ప D.No.13-1-579, మహాత్మాగాంధీ కాలనీ అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నయెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్ రి॥డి॥కి చేరిన అనంతపురం రూరల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెం 67/4 లో ప్లాట్ నెం.18.
చెక్కుబంది:-తూర్పు:ప్లాట్ నెం.19, పడమర: ప్లాట్ నెం.17, ఉత్తరం: 18 అడుగుల రోడ్డు, దక్షిణం: ఇదే సర్వే నెంబర్‌లోని మిగతా జమీను.

సురేష్‌కుమార్. అడ్వకేట్, అనంతపురం

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై సిరిసాటి దస్తగిరి S/o Late S. సుంకన్న, D.No.1-187, G. కొట్టాల గ్రామం, పామిడి మండలం, అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచు కున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యం తరాలు, తకరార్లు ఉన్నయెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్ కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ పామిడి సబ్ రి॥డి॥కి చేరిన పామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.229-A లో ప్లాట్ నెం.26.
చెక్కుబంది:- తూర్పు: బారాన్ సాబ్ విక్రయించి ప్లాటు, పడమర:ప్లాట్ నెం.25, ఉత్తరం: 20 అడుగుల రోడ్డు, దక్షిణం:ప్లాట్ నెం.34.

Y.రామేశ్వర రెడ్డి. అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టు పై పుష్పావతి W/o M.రామలింగారెడ్డి, D.No.5-388, వెంకటాపురం గ్రామం, బుక్కరాయ సముద్రం మండలం అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచు కున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నయెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్ రి॥డి॥కి చేరిన అనంతపురం రూరల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.329లో ప్లాట్ నెం.104.
చెక్కుబంది:- తూర్పు: ప్లాట్ నెం.103, పడమర: ప్లాట్ నెం.105, ఉత్తరం:30అడుగుల రోడు, దక్షిణం: ప్లాట్ నెం.97.

Y.రామేశ్వర రెడ్డి. అడ్వకేట్, ATP Cell:9440565907